క్లుప్తంగా

సామూహిక అన్నప్రాసన



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న కార్పొరేటర్ వైష్ణవి ప్రసన్నకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 46వ డివిజన్ జూబ్లీపుర–3 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని, బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నాగలక్ష్మి, హెల్పర్లు సత్యవతి, స్థానిక మహిళలు గీత, మంగ, మాధవి, పద్మ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, సీపీలకు ఆహ్వానం

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 29న బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఖమ్మం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్న అంబేడ్కర్ జయంతి ముగింపు ఉత్సవాలకు హాజరుకావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్‌లను ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ శుక్రవారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణలు, ప్రజాచైతన్య సదస్సులు, వ్యాసరచన పోటీలు, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదానం, అన్నదానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సత్కారం..

ఖమ్మంవన్‌టౌన్: సివిల్స్ ఫలితాల్లో ర్యాంక్ సాధించిన చింతకాని మండలం నామారం గ్రామానికి చెందిన నర్సింశెట్టి చరణ్‌తేజను స్థానిక వీడియోస్ కాలనీలో పగడాల కిషోర్ ఇంట్లో సత్కరించారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు, నగర అధ్యక్షుడు మడూరి పూర్ణచందర్‌రావు, సముద్రాల శ్రీనివాసరావు, నర్సింహారావు, రవి, రఘు, రజనీకాంత్‌లు పాల్గొన్నారు.





కాల్వల్లో ఈత కొడుతున్న చిన్నారులు (ఫైల్)

వేసవి వేళ..

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా

- నీటి లోతుపై అవగాహన లేక మృత్యువాత
- కరువైన పెద్దల పర్యవేక్షణ
- చెరువులపై పహారా అవసరం

ఖమ్మంఅర్బన్: వేసవి వచ్చిందంటే పిల్లలకే కాదు, తల్లిదండ్రులకూ కొంత ఊరట లభిస్తుంది. పాఠశాలలు మూతపడడంతో ఇంటి వద్ద నుంచి చదువులకు కొంత విరామం దొరుకుతుంది. దీంతో పిల్లలు బంధువుల గ్రామాలకు వెళ్లడం, స్థానిక స్నేహితులతో కలిసి కాలక్షేపం చేయడంతో సెలవులు ఇలా ఆనందంగా గడిచిపోతుంటుంది. అయితే ఈ సరదా ఓ దశలో ప్రాణాంతకంగా మారుతోంది. ముఖ్యంగా వానకాలంలో కాల్వలు, వాగులు, చెరువులు పూర్తి స్థాయిలో నీటితో నిండకపోయినా.. సమీప నీటిమట్టం తప్పుదోవ పట్టిస్తుంటుంది. చాలా ప్రాంతాల్లో చిన్నారులు, కుర్రోళ్లు చెరువుల్లో ఈతకెళ్లి ప్రమాదానికి గురవుతున్నారు.

అవగాహన లేక..

బాల్యం అల్లరితో నిండి ఉంటుంది. వయసుపరంగా నీటిలోతు అంచనా వేసే సామర్థ్యం లేక ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. పండుగలు, వేసవి సెలవులకు ఆయా ఊళ్లకు వెళ్లడం.. సమీప ప్రాంతాల్లోని జలాశయాల్లో ఈతకు వెళ్తుండడంతో ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇలా ఖమ్మం నగరం చుట్టుపక్కలనే అనేక మంది చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఆ కొద్ది రోజులు తల్లిదండ్రులు తమ బిడ్డలకు జాగ్రత్తలు చెప్పకపోవడం, బయటకు వెళ్లేటప్పుడు ఆరా తీయకపోవడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. పెద్దలు వారి పనుల్లో నిమగ్నమై ఉండడం.. పిల్లలు ఇలా సరదాకు వెళ్లి తల్లులకు గర్భశోకం మిగిల్చుతున్నారు.

పల్లెల్లో మరింతగా..

పల్లెలు, పట్టణాల్లో మిత్రులు పిలవగానే పెద్దల అనుమతి లేకుండానే బయటికి వెళ్లడం నేటి చిన్నారుల అలవాటుగా మారింది. సమీప చెరువులు, వాగులు పిల్లలకు నిత్యం అందుబాటులో ఉండడంతో సరదాగా అక్కడకు వెళ్లడం.. అవగాహన లేక మృత్యువాత పడడం ఏటా జరుగుతూనే ఉన్నాయి. బయటకు వెళ్లే సమయాన తల్లిదండ్రులు రెండు నిమిషాలు వెనకాడి ''ఎక్కడికి వెళ్తున్నావు?''అని అడిగితే.. ఇటువంటి అవాంఛిత ఘటనలు చోటు చేసుకోకుండా ఉంటాయి. అధికారులు, చైల్డ్‌లైన్ ప్రతినిధులూ తల్లిదండ్రులపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సెలవుల్లో పహారా అవసరం

పండగ సెలవులు లేదా వేసవి ఇతరాత్ర సెలవు దినాల్లో అధికారులు స్థానిక పోలీసులు, పాలకులు కీలక పాత్ర వహించాల్సిన అవసరం ఉంది. వాగులు, ఏరులు, కాల్వలు, చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైతే తాత్కాలికంగా వాచ్‌మెన్‌లను నియమించడం వంటి చర్యలు చేపడితే చాలా వరకు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పర్యవేక్షణ తప్పనిసరి

పలుచోట్ల చిన్నారులు ఈత రాకపోయినా చెరువుల్లో దిగి సరదాగా తేలాలని ప్రయత్నించడం ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది. శిక్షణ లేకుండా నీటిలోకి దిగడం తగదని, చిన్నారులు స్నానాలకైనా పెద్దల పర్యవేక్షణలోనే వెళ్లాలన్నదే నిపుణులు సూచిస్తున్నారు. కాగా, వేసవి సరదా తప్పదు కానీ అది జీవితాన్ని ఆస్వాదించాలనే ఉద్దేశంతో ఉండాలి. చిన్న చిన్న నిర్లక్ష్యాలు, తల్లిదండ్రుల అలసత్వంతో ఓ కుటుంబాన్ని శాశ్వతంగా విషాదంలో ముంచేస్తున్నాయి. ఈ నేపథ్యాన పిల్లలపై పర్యవేక్షణను మరింత కఠినంగా పాటించాలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదాల్లో కొన్ని..



మున్నేరులో ఈతకు వెళ్లి మృతిచెందిన దృశ్యం(ఫైల్)

- ఇటీవల మున్నేరులో ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురు మృతి చెందిన విషాద ఘటనతో రెండు కుటుంబాల్లో తీరని దుఃఖం నింపింది.
- గత ఏడాది అదే మున్నేరుపై నగరశివారు ధంసలాపురం వద్ద నేషనల్ హైవే వంతెన నిర్మాణ పిల్లర గుంతల్లో తండ్రితో చేపలు వేటకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు దిగి మృత్యువాత పడ్డారు. తండ్రి ఎదుటే కుమారుడు మృతి చెందగా.. ఒకే ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు.
- గత రెండేళ్ల క్రితం హాస్టల్‌లో ఉండి ఉన్నత విద్యను చదువుతున్న యువకులు ఈత కోసం వెళ్లి సాగర్ ప్రధాన కాల్వలో సాగర్ నీటి వేగాన్ని గుర్తించలేక మృతి చెందారు. ఇలా అనేక ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.
- గత కొన్నేళ్ల క్రితం రఘునాథపాలెం మండలం ఈర్లపుడిలోని చెరువులో ఈతకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు, పాపటపల్లిలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం వంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

వరంగల్ సభకు భారీగా తరలిరండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

కూసుమంచి/కామేపల్లి: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు భారీగా పార్టీ శ్రేణులు తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కూసుమంచి మండలంలోని మంగలితండా, ఈశ్వరమాధారం, రాజుపేట బజార్ గ్రామాల్లో పార్టీ జెండాలను మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఎగురవేసి మాట్లాడారు.ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చి పార్టీకి అండగా ఉన్నామని తెలియజేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, కార్యదర్శి ఆసిఫ్‌పాషాతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని ఆ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు అంతోటి అచ్చయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, కృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి, బాబు, శంకర్, అనంతరాములు, రాంబాబు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం.. పనులు చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకరావాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కాంట్రాక్టర్లకు సూచించినట్లు తెలిసింది. శుక్రవారం కమిషనర్ తన చాంబర్‌లో కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. పనుల నిర్వహణ, టెండర్లు దాఖలు, పెండింగ్ బిల్లులు, తదితర సమస్యలపై కమిషనర్ కాంట్రాక్టర్లతో చర్చించారు. ఈనేపథ్యానగత ప్రభుత్వ హయాంలో చేసిన ఎస్‌డీఎఫ్ పనులకు సంబంధించిన బిల్లులు రాక సక్రమంగా పనులు చేయలేకపోతున్నామని కాంట్రాక్టర్లు తెలుపగా.. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు వచ్చేలా కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడకుండా జనరల్ ఫండ్ కింద ట్రెజరీ చెక్కులను జారీ చేస్తామని తెలిపినట్లు తెలిసింది. ప్రతీ రోజు పనికి వచ్చే కార్మికులకు పీఎఫ్ చెల్లించేందుకు సానుకూలంగా కాంట్రాక్టర్లు స్పందించినట్లు తెలిసింది. కార్మికుల సరఫరాతో పాటు ఇతర పనులకు టెండర్లు దాఖలు చేస్తామని కాంట్రాక్టర్లు కమిషనర్‌కు తెలిపినట్లు సమాచారం. ఎస్‌డీఎఫ్ పనులకు సంబంధించిన చెక్కులు త్వరలోనే ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కాంట్రాక్టర్లు చర్చించుకున్నారు.

గిగ్ వర్కర్ల చట్టం సమగ్రంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రంలో పనిచేస్తున్న గిగ్ వర్కర్ల కోసం తెచ్చే చట్టం సమగ్రంగా ఉండాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు ప్రభుత్వానికి సూచించారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో బాలపేట రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో గిగ్ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భారత పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ప్రస్తావించిన అంశాలను ఆయన ఈ సందర్భంగా గిగ్ వర్కర్లకు వివరించారు. ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ వెబ్‌సైట్‌లో ఉంచిన తెలంగాణ గిగ్–ప్లాట్‌ఫామ్ వర్కర్స్ రిజిస్ట్రేషన్ సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ యాక్ట్ –2025 బిల్లును చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గిగ్ వర్కర్లు ఎండీ.ఆరిఫ్, వంశీ, కీర్తి వీరస్వామి, భార్గవ్, అన్వర్, జితేందర్, రమేష్, రామారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భూసారం పెంచుకుంటే అధిక దిగుబడులు



భూసార పరీక్షల పత్రం అందిస్తున్న ఏఓ వాణి

కూసుమంచి: రైతులు పంటలసాగు లాభదాయకంగా ఉండాలంటే భూసారాన్ని పెంచుకోవాలని, ఇందుకోసం ప్రతి మూడేళ్లకు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ వాణి అన్నారు. శుక్రవారం మండలంలోని గైగోళ్లపల్లి గ్రామంలో డిజిటల్ గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన భూసార పరీక్షల అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం డిజిటల్ గ్రీన్ సంస్థ కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం, పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని బుర్హాన్‌పురం ప్రాంతంలో రవీంద్రనాథ్‌ఠాగూర్ రోడ్డులో గల ప్రధాన డ్రెయినేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను కేఎంసీ కార్మికులు తొలగించారు. శుక్రవారం 'సాక్షి'లో 'డ్రెయినేజీ ప్లాస్టిక్‌మయం..'అను శీర్షికతో ప్రచురితమైన కథనానికి కేఎంసీ శానిటేషన్ అధికారులు స్పందించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య కార్మికులతో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపజేశారు. డ్రెయినేజీలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని కార్మికులకు సూచించారు.

పడకేసిన ప్రత్యేక పాలన..

- జీపీల్లో రోడ్ల వెంటే చెత్త పారబోత
- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- కనిపించని ప్రత్యేకాధికారులు
- శివారు ప్రాంతాలపై చిన్నచూపు..



ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారి మర్రిగూడెం స్టేజీ సమీపాన రోడ్డు పక్కనే పారబోసిన వ్యర్థాలు

కామేపల్లి: పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. చుట్టపుచూపుగా వచ్చిపోతుండడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎక్కడి చెత్తా అక్కడే దర్శనమిస్తోంది. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకపోవడంతో ప్రజలు రోడ్ల వెంట పడేస్తుండగా.. దుర్వాసన వస్తోంది. ఇక శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటి చెత్త సేకరణకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద చెత్త డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసి చెత్తను తరలించగా.. ప్రసుత్తం అలా జరగడం లేదు.


అధికారుల డుమ్మా..

పంచాయతీల్లో పాలనను పర్యవేక్షించడం ప్రత్యేకాధికారులకు సాధ్యం కావడం లేదు. కనీసం వారానికోసారైనా పర్యటించకపోవడంతో పాటు వారు సొంత శాఖ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. కొంతమంది సాకులు చెప్పి విధులకు డుమ్మా కొట్టడం, ఇంకొందరు ప్రత్యేక విధుల పేరిట పూర్తి సమయం కేటాయించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శివారు ప్రాంతాల్లో పరిస్థితి దారుణం

ఆయా గ్రామా పంచాయతీ పరిధిలోని శివారు ప్రాంతాల్లో అధికారుల పట్టింపు కరువైంది. కనీస మౌలిక సదుపాయలు కల్పించకపోవడంతో ఎక్కడి చెత్తా అక్కడే పేరుకుపోతుంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పట్టించుకోవడం లేదు..



గ్రామాల్లో చెత్తను తరలించడం లేదు. దీంతో ఎక్కడా ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే చెత్తను పడేస్తుండడంతో దుర్వాసన వస్తుంది. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నా ప్రత్యేకాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– పుచ్చకాయల ఉదయ్‌కిరణ్, తాళ్లగూడెం

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. డంపింగ్ యార్డులు నిర్మించిన కొత్తలో తడి ,పొడి చెత్త వేరు చేసి కంపోస్టు ఎరువు తయారు చేశారు. ఆ ఎరువును నర్సరీల్లో మొక్కలకు ఉపయోగించారు. కానీ క్రమక్రమంగా డంపింగ్ యార్డుల నిర్వాహణను పట్టించుకోకపోవడంతో అవి కూడా నిరుపయోగంగా మారాయి.



నిరూపయోగంగా ఉన్న టేకులతండా డంపింగ్ యార్డు

సంక్షిప్తంగా..

● దరఖాస్తుల వెల్లువ

నేలకొండపల్లి: మండలంలోని కొంగర, తిరుమలాపురం, అమ్మగూడెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొంగరలో 23, తిరుమలాపురంలో 31, అమ్మగూడెంలో 67 దరఖాస్తులను రైతులు వివిధ సమస్యలపై అందించారు. కాగా, ఈ సదస్సులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు వి.వెంకటేశ్వర్లు, తఫ్జల్‌హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్‌రావు, అల్లం రవి పాల్గొన్నారు.

● వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న రవిమారుత్

ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్‌గృహకల్పలో గల స్ప్రింగ్‌లీఫ్ పాఠశాలలో విద్యార్థులకు కళాభిరుచిని పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదరంగం, ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్, చిత్రలేఖనం, నృత్యం, సంగీత వాద్యాలపై, క్రికెట్, యోగా, స్విమ్మింగ్, స్కేటింగ్ వంటివి నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● టీస్టాల్ తొలగింపు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని శ్రీ శ్రీ సర్కిల్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా అక్రమంగా రోడ్డులో ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బందితో శుక్రవారం తొలగించారు. ప్రజా రవాణాకు అడ్డంకులు ఏర్పరిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● సర్వర్‌కే సమస్య..

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ కార్యాయంలో శుక్రవారం మధ్యాహ్నం తర్వాత ఇంటర్నెట్ ఆగిపోవడంతో పలు పౌర సేవల్లో జాప్యం జరిగింది. గత కొద్ది రోజులుగా ఇంటర్నెట్ సౌకర్యం సక్రమంగా లేక కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల చెల్లింపు, ఎర్లీబర్డ్‌లో పన్నుల వసూళ్లు, పంపు కనెక్షన్ల డేటా ఎంట్రీ, ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఎంట్రీలు, రాజీవ్ యువ వికాసం పెండింగ్ దరఖాస్తుల అప్‌లోడ్, కార్యాలయ పనులతో కేఎంసీ కార్యకలాపాలు అంతా ఆగిపోయాయి. ఫీజు చెల్లింపుల్లో చివరి రోజుల్లో కార్యాలయంలో నెట్ పని చేయకపోతే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు.

● శిక్షణ కార్యక్రమం

ఖమ్మం మామిళ్లగూడెం: మే 4న అంతర్జాతీయ నవ్వు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం లైన్స్ భవన్ సహకారనగర్‌లో ఈనెల 27న ఉదయం 10 గంటలకు ఆదాయ వనరులు సృష్టించడం ఎలా, ఉచిత సర్టిఫికెట్ యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రైనర్, న్యాయవాది మరికంటి వెంకట్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగ్జిక్యూటివ్ తాత రాఘవయ్య, రిటైర్ లెక్చరర్ గొల్లమందల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● అంబేడ్కర్ జయంతి వారోత్సవాలు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని ఓ గార్డెన్స్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యాన అంబేడ్కర్ జయంతి వారోత్సవాల్లోభాగంగా శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేటికీ అంబేడ్కర్ స్తూపాలను అభివృద్ధి చేస్తూ, 'పంచతీర్థ'ప్రాజెక్ట్ ద్వారా ప్రపంచానికి ఆయన గొప్పతనాన్ని చాటుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సుదర్శన్, జిల్లా పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నున్నా రవికుమార్, అల్లిక అంజయ్య, రవి రాథోడ్, వీజా రెడ్డి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

● కొవ్వొత్తుల ర్యాలీ

నేలకొండపల్లి: కశ్మీర్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శుక్రవారం రాత్రి ప్రజా సంఘాల ఆధ్వర్యాన మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసాని నాగేశ్వరరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



పూజలో పాల్గొన్న కూరాకుల నాగభూషణం

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి దేవాలయంలో శ్రీ గంగమ్మ తల్లి, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వేద పండితులు మంత్రోచ్ఛరణతో ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించాక స్థల దాత చలపతిరావు దంపతులను సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేకల మల్లిబాబు, బి.మల్సూర్‌లతోపాటు సీతారాములు, నాగయ్య, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

● వీరన్నస్వామి జాతర ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు జరిగే శ్రీవీరన్నస్వామి జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. తొలి రోజు దేవాలయంలో వద్దకు వీరన్న స్వామి విగ్రహాన్ని ఊరేగింపు చేయటం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుంబూరు దయాకర్ రెడ్డి, వెన్నపూసల సీతారాములతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ చావా కోటయ్య, ఏలూరి శ్రీనివాసరావు, రావెళ్ల కృష్ణారావు, చావా కిరణ్‌కుమార్, బెల్లం పుల్లయ్య, బి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా బోనాలు

కామేపల్లి: మండలంలోని ముద్దులపల్లి గ్రామంలో సమక్క–సారక్క అమ్మవారి గద్దెల ప్రతిష్ఠ నిర్వహించగా శుక్రవారం అమ్మవార్లకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనమెత్తి మేళతాళాలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా అమ్మవారి గద్దెల వద్దకు చేరుకొచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

● 'ఎస్‌బీఐటీ'లో ఆరోహన్ టెక్నికల్ ఫెస్ట్..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ కృష్ణ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఆరోహన్–2025 టెక్నికల్ ఫెస్ట్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ రిటైర్డు ప్రొఫెసర్ కే.ఎం.లక్ష్మణ్‌రావు, టెక్స్ స్కై సీఈఓ బత్తినేని స్వాతి, టాస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలు ప్రవరాఖ్యులు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఏఐపై విద్యార్థులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.అనంతరం ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ మాట్లాడాక.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్, స్లైడ్ డెక్, కోడ్ స్ప్రింట్, సర్కుట్రిక్స్, క్విజ్, ట్రెజర్ హంట్, స్నాప్‌సాట్ సాగా, ఫ్రైమ్ ఫ్లెక్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్ర బాబు, ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● చెక్కు అందజేత

రఘునాథపాలెం: ఇటీవల కరెంట్ షాక్‌తో మృతిచెందిన మండలంలోని పాపటపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి సాయిచరణ్ కుటుంబానికి విద్యుత్ శాఖ తరపున రూ.5లక్షలకు సంబంధించి నచెక్కును శుక్రవారం రాత్రి రఘునాథపాలెం విద్యుత్‌శాఖ ఏడీ సంజయ్‌కుమార్ సమక్షంలో చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్ష్మణ్ గౌడ్, దుంప నాగేష్, మాజీ ఉపసర్పంచ్ వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రవీందర్, బాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

● జేఎల్‌ఎంల బకాయిలు చెల్లించాలి

ఖమ్మంవ్యవసాయం: 2011 జేఎల్‌ఎంల బ్యాచ్ మానటరి బెనిఫిట్స్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ టీజీ యూఈఈయూ(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ టెక్నికల్ డీఈ బాబూరావుకు కార్మిక సంఘ నేతలు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్, జిల్లా కార్యదర్శి కె.నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్, ఖమ్మం రూరల్ డివిజన్ కార్యదర్శి సీతయ్య, కృణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● పదోన్నతులు కల్పించాలని వినతి

కామేపల్లి: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పని చేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు అప్‌గ్రేడ్ చేసి వారికి పదోన్నతులు కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖ అడిషినల్ సెక్రటరీ లక్ష్మీబాయికి తెలంగాణ స్టేట్ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ (టీఎస్‌టీటీఎఫ్) అధ్యక్షుడు బానోత్ ఈరునాయక్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రాన్ని అందించారు.

● న్యాయవాద సంక్షేమ సంఘం ఎన్నికల జోరు

ఖమ్మంలీగల్ : వచ్చేనెల 2న నిర్వహించే న్యాయవాద సంక్షేమ సంఘ సొసైటీలో నాలుగు డైరెక్టర్ స్థానాలకు ఆరు నామినేషన్లు దాఖలు కాగా అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. సొసైటీలో మొత్తం 549 ఓట్లు ఉండగా.. పోటీలో ఉన్న ఆవుల అనురాధకు బీరువా, వల్లపు లింగయ్యకు బ్యాట్, షేక్ నస్రీన్‌కు బ్యాటరీలైట్, కొలకలూరి ప్రసాద్‌కు బ్రష్, కాసర రాజశేఖరరెడ్డికి బకెట్, పాలవెల్లి వెంకటేశ్వర్లుకు కొబ్బరికాయ గుర్తులను ఎన్నికల అధికారి జి.రమేష్ కేటాయించారు.

● నేటితో ముగియనున్న బార్‌ల దరఖాస్తులు..

ఖమ్మంక్రైం: నగరంలో మూతపడిన రెండు పాత బార్‌లకు సంబంధించిన దరఖాస్తులు ప్రక్రియ నేటితో ముగియనుంది. కాగా, శుక్రవారం ఒక్క రోజే 63 దరఖాస్తులు రావడం గమనార్హం. ఇప్పటి వరకు 85 దరఖాస్తులకు గాను రూ.85లక్షల ఆదాయం ఎక్సైజ్ శాఖకు లభించింది. రేపు సాయంత్రం 5 గంటల కల్లా టోకెన్లు తీసుకోవాలని ఎక్సైజ్ స్టేషన్–1 సీఐ కృష్ణ తెలిపారు.

● 29న పండ్ల చెట్ల వేలం

కూసుమంచి: చేగొమ్మలోని ప్రభుత్వ ఉద్యాన నర్సరీలో ఉన్న మామిడి, సపోట, కొబ్బరి కాయలను విక్రయించేందుకు ఈనెల 29న నర్సరీలో బహిరంగ వేలాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5వేల నగదును వేలం తేదీకంటే ముందు డిపాజిట్‌గా చెల్లించాలని, వివరాలకు 89777 14104 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

● ఉచిత మెగా హెల్త్ క్యాంప్



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఖమ్మంలీగల్: నగరంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ప్రారంభించారు. ఈ శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన యశోద ఆస్పత్రి వైద్యులు న్యాయవాదులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. న్యాయమూర్తులు ఎం.కల్పన, కాసరగడ్డ దీప, బిక్కం రజిని, నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తొండపు వెంకటేశ్వరరావు, దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షురాలు మోత్కూరు విజయశాంతి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.